ఆడుతూ పాడుతూ పనిచేస్తుంటే!

- స్వీడన్ కార్పొరేట్ సంస్కృతిలో వర్క్ - లైఫ్ బ్యాలెన్స్‌పై ప్రశంసలు
- ఆకర్షిస్తున్న భారత సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వీడియో

న్యూఢిల్లీ, జూన్ 8: పని-వ్యక్తిగత జీవితం సమతుల్యత అనేది ఒక సాధారణ పదంలా అన్పించవచ్చు. కానీ యూరప్‌లో దానిని జీవన వేదంలా భావించడమే కాక, దానిని ఆచరణలో అమలు చేసి చూపిస్తారని ఒక భారత సాఫ్ట్‌వేర్ డెవలపర్ అభిప్రాయపడ్డారు. స్వీడన్‌లో పనిచేస్తున్న అశుతోష్ సమల్ ఇన్‌స్టాలో దీని గురించి పోస్ట్ చేసిన వీడియో నెటిజన్లను ఆకర్షిస్తున్నది. ముఖ్యంగా ఆడుతు పాడుతు పనిచేసే విధానాన్ని తన వీడియోలో పేర్కొన్నారు. స్వీడన్‌లో సాధారణంగా ఉద్యోగులు పనిని ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తారని, కొన్ని కార్యాలయాల్లో పని ప్రారంభానికి ముందు ఉచితంగా అల్పాహారం కూడా అందజేస్తారని తెలిపారు. పని ప్రదేశాలలో ఎలాంటి డెస్కుల కేటాయింపు ఉండదని, సీఈవో సహా ప్రతి ఒక్కరినీ వారికి ఇష్టమైన ప్రదేశంలో కూర్చోబెడతారని, అధికార క్రమాన్ని తొలగిస్తారని, అందరూ ఒకటే స్థాయి అని, ప్రయోషన్ల కోసం పోటీ పడక్కర్లేదని, సీఈవో కూడా కొన్ని సార్లు ఉద్యోగుల పక్కనే కూర్చుని పని చేస్తుంటారని సమల్ పేర్కొన్నారు. పని సమయంలో విరామాలు తీసుకోవడాన్ని ప్రోత్సహిస్తారని, నచ్చిన ఆటలు ఆడుకోవచ్చునని, కాఫీ తాగుతూ ఆస్వాదించవచ్చునని, వేసవి కాలంలో కొన్ని కార్యాలయాల్లో పని గంటలను 8 నుంచి ఏడు గంటలకు కుదిస్తారని తెలిపారు.

పిల్లల్లోనూ బ్రెయిన్ ట్యూమర్

- కేసుల పెరుగుదలను గుర్తించిన వైద్యులు
- ముందస్తు సంకేతాలను గుర్తించి చికిత్స చేయిస్తే సత్ఫలితాలు

న్యూఢిల్లీ: మెదడులో కణుతులు (బ్రెయిన్ ట్యూమర్) వృద్ధులకే వస్తాయనే భావన ఉంది. కానీ ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా బాలలు, 20-30 ఏండ్ల యువతలోనూ బ్రెయిన్ ట్యూమర్ల కేసులు పెరుగుతున్నట్లు వైద్యులు తెలిపారు. వీరిలో అత్యధికులకు రోగ నిర్ధరణ చాలా ఆలస్యంగా జరుగుతున్నదని వెల్లడించారు. ఈ వ్యాధి పట్ల అవగాహన పెంచుకోవడం, సకాలంలో చికిత్స చేయించుకోవడం, తల్లిదండ్రులు నిరంతరం గమనిస్తుండటం తప్పనిసరి అని వివరించారు. నేషనల్ బ్రెయిన్ ట్యూమర్ సొసైటీ వెల్లడించిన వివరాల ప్రకారం, మొత్తం బ్రెయిన్ ట్యూమర్స్ కేసుల్లో 5.7 శాతం మేరకు 0-19 ఏండ్ల మధ్య వయస్కులకు వస్తున్నాయి. ఇవి హానికరం కానట్లుగా ఉంటాయని, అయితే సకాలంలో చికిత్స చేయించడం ముఖ్యమని డాక్టర్ అనురాగ్ సక్సేనా చెప్పారు.

ఎలా గుర్తించాలి?

శిశువులకు ఈ వ్యాధి సోకితే, వారి పుర్రె ఎదుగుదల అసాధారణంగా ఉంటుంది. బాలలకు బ్రెయిన్ ట్యూమర్ వస్తే అతిగా ఏడవడం, స్పందించకపోవడం, కంటి చూపు సమస్యలు కనిపిస్తాయి. టీనేజర్లలో అయితే అలసట, తలనొప్పి, తల తిప్పడం, కండ్లు తిరగడం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఉదయం పూట వాంతులు అవడం, తలనొప్పితోపాటు వాంతులు రావడం, చూడటం, వినటం, మాట్లాడటంలో సమస్యలు; నడవటం ఇబ్బందికరంగా ఉండటం, మానసిక స్థితిలో ఆకస్మిక మార్పులు, మెదడులో మెరుపులు మెరిసినట్లు ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఎలాంటి పరీక్షలు చేయించాలి?

ఎంఆర్ఐ లేదా సీటీ స్కాన్స్ చేయిస్తే బ్రెయిన్ ట్యూమర్లను గుర్తించవచ్చు. హానికరం కాని ట్యూమర్లను శస్త్ర చికిత్స ద్వారా పూర్తిగా తొలగించవచ్చు. దీర్ఘకాలిక నష్టాన్ని నివారించాలంటే, ముందుగానే ఈ లక్షణాలను గుర్తించి, చికిత్స చేయించాలి.

ఫండమెంటల్స్‌పై పట్టు సాధించండి

- సాఫ్ట్‌వేర్ రంగంలో ఏఐ ప్రభావం నేపథ్యంలో యువ ప్రొఫెషనల్స్‌కు సత్య నాదెళ్ల సూచన

న్యూఢిల్లీ, జూన్ 8: కృత్రిమ మేధ కారణంగా సాఫ్ట్‌వేర్ రంగం రూపురేఖలు పూర్తిగా రూపాంతరం చెందుతున్న క్రమంలో టెక్ రంగంలోకి అడుగుపెట్టాలనుకునే యువ ప్రొఫెషనల్స్‌కు అవసరమైన ఒక నైపుణ్యాన్ని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల వెల్లడించారు. అదే బలమైన ఫండమెంటల్స్. వీటి శక్తిని ఎప్పుడూ తక్కువగా అంచనా వేయవద్దని యూట్యూబర్ సజ్జాద్ ఖాడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) శక్తిసామర్థ్యాలు రోజురోజుకూ గణనీయంగా పెరుగుతున్నప్పటికీ పునాది గణన ఆలోచన, సిస్టమ్ డిజైన్ నైపుణ్యాలు ఇప్పటికీ చాలా కీలకమని తాను నమ్ముతున్నానన్నారు. 'మీరు కనుక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయితే సాఫ్ట్‌వేర్ నిజమైన బేసిక్స్‌పై పట్టు సాధించండి, ఇది చాలా ముఖ్యమైన విషయంగా నేను భావిస్తున్నా. గణన పరంగా ఆలోచించే సామర్థ్యం కూడా అవసరం' అని అన్నారు. ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ ల్యాండ్‌స్కేప్‌లో అడుగుపెడుతున్న వారికి మీ సలహా ఏమిటన్న ప్రశ్నకు స్పందిస్తూ.. ఏఐ కోడింగ్‌లో సహాయపడగలిగినప్పటికీ, అది ఇప్పటికీ తార్కికంగా ఆలోచించే, నిర్మాణాత్మక మార్గదర్శకత్వాన్ని అందించే యూజర్ సామర్థ్యంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఆ సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్‌గా మారడానికి మార్గం వేగవంతం అవుతుందని, దీంతో మనమందరం మరింత సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్‌లుగా మారబోతున్నామని ఆయన తెలిపారు.

లాస్ ఏంజెల్స్‌లో ఆందోళనలు తీవ్రం

- కార్ల దహనం.. వ్యర్థాలతో పోలీసులపై దాడి
- చట్టాన్ని అతిక్రమిస్తే ఊరుకోబోమన్న ట్రంప్

లాస్ ఏంజెల్స్, జూన్ 8: అక్రమ వలసదారుల ఏరివేతలో భాగంగా ఫెడరల్ అధికారులు చేపట్టిన దాడులతో లాస్ ఏంజెలెస్‌లో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు రెండో రోజు కూడా కొనసాగాయి. శుక్రవారం లాస్ ఏంజెల్స్‌లో ఫెడరల్ అధికారులు జరిపిన దాడులతో నగరమంతా అట్టుడికిన సంగతి తెలిసిందే. అయితే శనివారం కూడా నగరంలో అదే పరిస్థితులు కన్పించాయి. ఫెడరల్ అధికారులకు స్థానికుల నుంచి తీవ్రస్థాయిలో ప్రతిఘటన ఎదురవుతున్నది. స్థానికులకు విపక్ష డెమొక్రటిక్ పార్టీ మద్దతుదారులు, విదేశీయులు తోడవ్వడంతో ఒక్కసారిగా ఆందోళన తీవ్రరూపం దాల్చింది. ఆగ్రహంతో నిరసనకారులు ప్యాకింగ్ కార్డులు, కాంక్రీట్ వ్యర్థాలతో పాటు దొరికిన వస్తువులతో పోలీసులపై దాడికి ప్రయత్నించారు. పలు చోట్ల ఆందోళనకారులు కార్లను తగులబెడుతున్నారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగంతో పాటు వారిని అరెస్ట్ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

వలసదారులను విడిచిపెట్టం

ఒక వైపు అక్రమ వలసదారుల ఏరివేతపై లాస్ ఏంజెల్స్‌లో తీవ్ర ప్రతిఘటన ఎదురవుతున్నా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తగ్గేదేలే అన్న తరహాలో వ్యహరిస్తున్నారు. అక్రమ వలసదారులను విడిచిపెట్టేది లేదని ఆయన హెచ్చరించారు. 2 వేల మంది నేషనల్ గార్డ్స్‌ను మోహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ అరాచకానికి కారణం పెయిడ్ ట్రబుల్ మేకర్స్ అని ఆరోపించారు.

దాడి చేస్తే జైలు తప్పదు

లాస్ ఏంజెల్స్ ఘటనను వైట్ హౌస్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మిల్లర్ తీవ్రంగా ఖండించారు. వలసదారుల గెంటివేతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. కాగా, పోలీసులపై దాడికి ప్రయత్నించే ఆందోళనకారులకు జైలే గతి అని ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ హెచ్చరించారు.

నిజమేంటో ఇప్పటికైనా బయటకు రావాలి

అవినీతి కేసుపై సత్యపాల్ మాలిక్ డిమాండ్

న్యూఢిల్లీ, జూన్ 8: ఓ అవినీతి కేసులో తనను ఇరికించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రయత్నించిందని, తనపై సీబీఐని ప్రయోగించి..బెదిరించేందుకు ప్రయత్నం జరిగిందని జమ్ము కశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ అన్నారు. ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో తాను ఐసీయూలో చేరినట్టు ఆదివారం 'ఎక్స్' వేదికగా తెలిపారు. తనకు ఏదైనా జరగరానిది జరిగితే, కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుతున్న బీజేపీ గురించి దేశం తెలుసుకోవాలని తాను కోరుకుంటున్నట్టు ఆయన పోస్ట్ చేశారు. అవినీతి కేసులో తనను అప్రతిష్ట పాల్జేసేందుకు కేంద్రం ప్రయత్నించిందని ఆరోపించారు. ఒక టెండర్ విషయంలో రూ.150 కోట్లు లంచాన్ని తనకు ఆఫర్ చేయగా..తిరస్కరించిన సంగతిని ప్రధాని మోదీకి స్వయంగా తెలియజేశానని ఆయన అన్నారు. గవర్నర్‌గా తనను బదిలీ చేశాక, మరొకరి సంతకంతో సంబంధిత టెండర్ ఆమోదం పొందిందని, తనపై ఆరోపణల్లో వాస్తవాల్ని ఇప్పటికైనా బయటపెట్టాలని కోరారు.

మోదీ పాలనలో అన్ని వ్యవస్థలూ హైజాక్

ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపణ

న్యూఢిల్లీ, జూన్ 8: నరేంద్ర మోదీ 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్ని రాజ్యాంగ సంస్థలు హైజాక్ అయ్యాయని ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ ఆదివారం కేంద్రంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల కమిషన్ ఎన్నికల తేదీలను ప్రకటించడానికి ముందే బీజేపీ ఐటీ సెల్‌కి ఆ విషయం తెలిసిపోతుందని, దీనిపై తాము ఓ కన్నేసి ఉంచామని విలేకరులతో మాట్లాడుతూ తేజస్వీ అన్నారు. రాజ్యాంగ సంస్థలు నిజాయితీగా పనిచేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అవి ఒత్తిళ్లకు లొంగిపోతే ఇక న్యాయం ఎవరికీ దక్కదని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఆయన సమర్థించారు. 2020 బీహార్ ఎన్నికలను తేజస్వీ ప్రస్తావిస్తూ 2020 ఎన్నికల్లో తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని, అయితే తన వాదనను సమర్థించుకోవడానికి ఎన్నికల కమిషన్ మూడుసార్లు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసిందని ఆయన గుర్తు చేశారు. 'సాయంత్రం ఓట్ల లెక్కింపును ఎందుకు నిలిపివేశారు? రాత్రి మళ్లీ ఎందుకు ప్రారంభించారు? మొదట్లో విజేతలుగా ప్రకటించిన పేర్లను ఆ తర్వాత పరాజితులుగా ఎందుకు ప్రకటించవలసి వచ్చింది?' అని ఆయన ప్రశ్నించారు. ఈ ఏడాది చివరిలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సారథ్యంలోని జేడీయూకి, దాని మిత్రపక్షమైన బీజేపీకి వ్యతిరేకంగా పోరాడే ప్రతిపక్ష కూటమికి తేజస్వీ యాదవ్ నాయకత్వం వహించనున్నారు.

మోదీ ఒక జోక్..

కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఫైర్

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఆదివారం ఎక్స్‌లో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పహల్గాం దాడి తర్వాత పాకిస్థాన్‌ను ఒంటరిని చేయడంలో మోదీ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. ఇది మోదీ భారత సైనికులకు, దేశ ప్రజలకు చేసిన నేరపూరిత ద్రోహంగా ఆయన అభివర్ణించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఒక జోక్ అని ఆయన ఎద్దేవా చేశారు. ప్రధానిగా 11 ఏండ్లలో మోదీ ఒక్క మీడియా సమావేశం కూడా నిర్వహించలేదని తెలిపారు. ఆయన పదవీ కాలం ముగియనుందని.. ఆయన రాజకీయాలు ప్రపంచ వ్యాప్తంగా బహిర్గత మయ్యాయని తెలిపారు. మోదీ పాలన కుంటుపడిందని.. ఆయన రాజకీయాలు బెడిసికొట్టాయని చెప్పారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆ దేశంపై పటిష్ఠ చర్యలుంటాయని అందరూ భావించారని.. కానీ వాస్తవానికి పాకిస్థాన్ దౌత్య పరంగా, సైనికపరంగా లబ్ధి పొందుతూనే ఉందని చెప్పారు. పాక్‌కు చైనా ఆయుధాలు సమకూరుస్తున్నదని.. ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్‌లు రుణాలు మంజూరు చేస్తున్నాయని తెలిపారు. ఉగ్రవాదానికి కేరాఫ్‌గా ఉన్న పాకిస్థాన్‌ను ఐరాస భద్రతా మండలిలో ఉగ్రవాద వ్యతిరేక కమిటీ వైస్ చైర్మన్ పదవిలో కూర్చోబెట్టారని... ఇవన్నీ ప్రధాని మోదీ ఘోరమైన దౌత్య వైఫల్యాలేని ఆయన తీవ్రంగా విమర్శించారు.

కొవిడ్ ప్రమాద ఘంటికలు

వైద్య సంసిద్ధతపై మాక్ డ్రిల్

న్యూఢిల్లీ, జూన్ 8: దేశంలో కొవిడ్-19 యాక్టివ్ కేసుల సంఖ్య 6 వేలు దాటింది. గడచిన 48 గంటల్లో 769 కొత్త కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం ప్రకటించింది. గడచిన 24 గంటల్లో మరో ఆరు మరణాలు చోటుచేసుకున్నట్లు తెలిపింది. కేరళలో అత్యధిక కేసులు నమోదు కాగా తర్వాతి స్థానంలో గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ ఉన్నాయి. దీంతో వైద్య సిబ్బంది సంసిద్ధతను తనిఖీ చేసేందుకు కేంద్ర మాక్ డ్రిల్స్ నిర్వహిస్తోంది. అన్ని దవాఖానాలలో ఆక్సిజన్, ఐసోలేషన్ బెడ్స్, వెంటిలేటర్లు, ఇతరఅత్యవసర ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలని రాష్ట్రాలను ఆదేశించింది.

దేశంలో మొత్తం యాక్టివ్ కరోనా కేసులు **6,133**

కొత్తగా నమోదైన కేసులు **378**

ఈ ఏడాది ఇప్పటివరకు మరణాలు-**65**

తాజాగా నమోదైన మరణాలు-**6**

తొక్కిసలాటతో నాకు సంబంధం లేదు

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

మైసూరు : ఆర్సీబీ క్రికెట్ జట్టుకు సన్మానం జరిగిన విధాన సౌధ వద్ద తొక్కిసలాట జరగలేదని, చిన్నస్వామి స్టేడియం సమీపంలో జరిగిందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఆదివారం మైసూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ ఘటనతో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. తాము ఎటువంటి తప్పు చేయనపుడు ఇబ్బంది పడే ప్రశ్నే రాదని ఆయన చెప్పారు. అటువంటి సంఘటన జరగకూడదనే తాము అంటున్నామని, అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల ఆ సంఘటన జరిగిందని ఆయన వ్యాఖ్యానించారు. 'నేను బాధ పడుతున్నాను. యావత్ ప్రభుత్వం బాధ పడుతోంది. తొక్కిసలాటలోమొదటి మరణం సాయంత్రం 3.50 గంటలకు జరిగింది. కాని సాయంత్రం 5.45 గంటలకు నాకు సమాచారం అందింది' అని సిద్ధరామయ్య వెల్లడించారు. చిన్నస్వామి స్టేడియం సమీపంలో భద్రతా ఏర్పాట్ల గురించి నగర పోలీసు కమిషనర్ తనకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని ఆయన తెలిపారు. ఈ కారణంగానే సీనియర్ పోలీసు అధికారులపై చర్యలు చేపట్టామని ఆయన చెప్పారు.

4 నెలలైనా పరిహారం ఇవ్వరా?

కుంభమేళా తొక్కిసలాట ఘటనలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ తీరుపై అలహాబాద్ హైకోర్టు ఆగ్రహం

లక్నో, జూన్ 8: ఉత్తరప్రదేశ్‌లో నాలుగు నెలల క్రితం జరిగిన మహా కుంభమేళా తొక్కిసలాట ఘటనలో ఎంతోమంది అమాయక భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఆప్తులను కోల్పోయిన కుటుంబాల్ని ఆదుకోవాల్సిన ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం తన విధిని నిర్వర్తించటంలో విఫలమైంది. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందజేయకుండా యూపీ ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని అలహాబాద్ హైకోర్టు ధర్మాసనం విమర్శించింది. ఇందుకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై గత శుక్రవారం విచారణ జరుపుతూ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బాధిత కుటుంబం పట్ల అత్యంత దయ, గౌరవంతో పరిహారం చెల్లించటం రాష్ట్ర ప్రభుత్వ తప్పనిసరి విధిగా పేర్కొన్నది. మరణించిన వారి మృతదేహాల్ని బాధిత కుటుంబాలకు అందజేయటంలో ప్రభుత్వ అధికారులు వ్యవహరించిన వైఖరిపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఘటన జరిగి నాలుగు నెలలైనా ఒక బాధిత కుటుంబానికీ నష్ట పరిహారం దక్కకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధిత కుటుంబాల పట్ల సర్కార్ నిర్లక్ష్యం, ఉదాసీనత ప్రదర్శిస్తున్నట్టు భావిస్తున్నామని న్యాయమూర్తులు అన్నారు.

డబుల్ ట్రబుల్ ఇంజిన్

పెండ్లికి వెళ్లిన బాలికలపై గ్యాంగ్ రేప్

నిందితులను అరెస్ట్ చేసిన ఒడిశా పోలీసులు

గంజాం: బీజేపీ పాలిత ఒడిశాలో పెండ్లి మండపం నుంచి ఇద్దరు బాలికలను నలుగురు వ్యక్తులు కిడ్నాప్ చేసి, సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బ్రహ్మపూర్ ఎస్పీ శ్రావణ్ వివేక్ తెలిపిన వివరాల ప్రకారం ఈ దారుణం ఈ నెల 3న జరిగింది. విశాఖపట్టణానికి పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బాధితుల్లో ఒకరి వయసు 14 ఏండ్లు, మరొకరి వయసు 15 ఏండ్లు. వారి కుటుంబ సభ్యులు ఈ నెల 4న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం నలుగురు నిందితులు బాలికలపై సామూహిక లైంగిక దాడి చేసి, తీవ్రంగా కొట్టి, వదిలిపెట్టారు. బాధితులను ఈ నెల 6న వైద్య పరీక్షల కోసం పంపించారు. బాధితులు, నిందితులు ఒకే గ్రామానికి చెందినవారు.

వినియోగదారులను మాయ చేసే పద్ధతులు తొలగించాలి..

- ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌కు సీసీపీఏ ఆదేశం

న్యూఢిల్లీ: వినియోగదారులను మాయ చేసి, వారి సమ్మతి లేకుండా, గుట్టుగా బిల్లును పెంచే పద్ధతులేమైనా ఉన్నాయేమో సొంతంగా ఆడిట్ చేసుకుని, వాటిని తొలగించాలని ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌ను కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ (సీసీపీఏ) ఆదేశించింది. తమకు నచ్చిన దానిని ఎంపిక చేసుకునేందుకు వినియోగదారులకు గల స్వేచ్ఛను కట్టడి చేసే లేదా అనుచిత వ్యాపార లావాదేవీలకు దారి తీసే సూచనలు, నిబంధనలు, పద్ధతులు తమ ఇంటర్‌ఫేస్‌లలో ఉన్నాయేమో సొంతంగా తనిఖీ చేయాలని వినియోగదారుల వ్యవహారాల శాఖ శనివారం చెప్పింది. ఇటువంటి డార్క్ ప్యాటర్న్‌లను తమ ఇంటర్‌ఫేస్‌ల నుంచి మూడు నెలల్లోగా తొలగించాలని తెలిపింది. డార్క్ ప్యాటర్న్‌లను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ జాయింట్ వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. వివిధ మంత్రిత్వ శాఖలు, నియంత్రణ సంస్థల ప్రతినిధులు ఈ గ్రూప్‌లో ఉన్నారు.

డార్క్ ప్యాటర్న్ అంటే..

వినియోగదారులకు అదనపు ఉత్పత్తులను లేదా సేవలను అంటగట్టడం, విరాళాలను స్వీకరించడం కూడా డార్క్ ప్యాటర్న్‌లో భాగం. వినియోగదారుల సమ్మతి లేకుండానే ఇటువంటివాటిని చేర్చి, తద్వారా వారి నుంచి ఎక్కువ సొమ్మును ఈ-కామర్స్ సంస్థలు పొందుతాయి.

మణిపూర్‌లో నిషేధాజ్ఞలు

మెయితీ నేత అరెస్ట్‌పై నిరసనలు ■ ఇంటర్నెట్ సేవల నిలుపుదల

ఇంఫాల్ : మెయితీ రాడికల్ సంస్థ అరంబాయ్ తెంగోల్ నేత అరెస్ట్‌తో మణిపూర్‌లో శనివారం నుంచి హింసాత్మక నిరసనలు జరుగుతున్నాయి. ఆదివారం కూడా ఉద్రిక్తతలు కొనసాగడంతో పశ్చిమ ఇంఫాల్, తూర్పు ఇంఫాల్, థౌబల్, బిష్ణుపూర్, కాక్చింగ్ జిల్లాల్లో అధికారులు నిషేధాజ్ఞలు విధించారు. వీశాట్, వీపీఎన్ సౌకర్యాలతో పాటు ఇంటర్నెట్, మొబైల్ డేటా సేవలను అయిదు రోజులపాటు నిలిపేశారు. నిరసనకారులు శనివారం రాత్రి రోడ్లపై పాత టైర్లు, ఫర్నిచర్‌లను తగులబెట్టారు. ఇంఫాల్‌లో భద్రతా సిబ్బందితో ఘర్షణకు దిగారు. ఖురాయ్ లాంమ్‌లోంగ్‌లో ఓ బస్సుకు నిప్పు అంటించారు. రాజ్ భవన్‌కు 200 మీటర్ల దూరంలోని కంగ్లా గేట్ వద్ద నిరసనకారులను చెదరగొట్టేందుకు భద్రతా దళాలు బాష్పవాయు గోళాలను ప్రయోగించాయి. నిరసనకారులు, భద్రతా సిబ్బంది మధ్య ఘర్షణలో ముగ్గురు గాయపడ్డారు. కొందరు అరంబాయ్ తెంగోల్ కార్యకర్తలు పెట్రోల్‌తో ఆత్మాహుతి చేసుకుంటామని హెచ్చరించారు.

ఎలక్ట్రిక్ స్కూటర్లపై ట్రాఫిక్ గస్తీ

జైపూర్ ట్రాఫిక్ సిబ్బంది గస్తీ కోసం అత్యాధునిక 'సెల్ఫ్ బ్యాలెన్సింగ్' ఎలక్ట్రిక్ స్కూటర్లు వాడుతున్నారు.ఆదివారం హవా మహల్ వద్ద ఓ ట్రాఫిక్ పోలీస్ డ్యూటీ చేస్తూ ఇలా కనిపించారు.

వైట్ హౌస్ డేటా కొట్టేసిన మస్క్!

వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలో పనిచేసిన 'డోజ్' బృందం వైట్ హౌస్‌లోని డేటాను భారీగా యాక్సెస్ చేసింది. 'వాషింగ్టన్ పోస్ట్' కథనం ప్రకారం.. ఈ డేటా ట్రాన్స్‌మిషన్ గోప్యంగా జరిగింది. దీనికి రికార్డులు కానీ, ఏ విధంగా ట్రాన్స్‌మిషన్ అయిందో గుర్తించే అవకాశం కానీ లేకుండాపోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడ్మిని స్ట్రేషన్ అనుమతితోనే ఇదంతా జరిగింది. అంతర్గత భద్రతాధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, డోజ్ టీమ్స్ పట్టించుకోలేదు. వైట్‌హౌస్ డేటాను మస్క్ కాపీ చేశారన్న ఆరోపణలను అమెరికన్ సీక్రెట్ సర్వీస్ తోసిపుచ్చింది. అయితే డోజ్ టీమ్‌పై ఈ తరహా ఆరోపణలు కొత్త కాదు.

అద్భుతం.. అత్యంత పొడవైన కేబుల్ ప్లై ఓవర్

రాంచీలో అందుబాటులోకి

రాంచి, జూన్ 8: గిరిజన నాయకుడు కార్తీక్ ఉరావ్‌కి అంకితం చేస్తూ జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ జూన్ 5న ప్రారంభించిన సిర్మటోలి-మేకాన్ ఫ్లై ఓవర్ రాంచి నగరానికి కొత్త అందాలు తీసుకువచ్చింది. ఈ వంతెనను అద్భుతం, అసాధారణం, చిరస్మరణీయంగా అభివర్ణిస్తూ రాత్రి వేళ ఫ్లైఓవర్ అందాలను డ్రోన్ కెమెరాతో చిత్రీకరించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ సోరెన్ అభివర్ణించారు. రూ.372 కోట్ల వ్యయంతో నిర్మించిన 2.3 కిలోమీటర్ల పొడవైన ఈ ఫ్లైఓవర్ అద్భుతమైన డిజైనింగ్‌తో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని విజయంతంగా నిర్మాణం పూర్తి చేసుకుంది. దేశంలో రైల్వే లైను పైన నిర్మించిన మొట్టమొదటి అతి పొడవైన కేబుల్ వంతెన ఇదే కావడం విశేషం. 12 మోనోపైల్స్(స్తంభాలు)తోపాటు 72 కేబుళ్లను ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ఉపయోగించారు.

శ్మశానాలుగా దవాఖానలు!

ఇజ్రాయెల్ దాడుల్లో 31 మంది మృతి

గాజా: పవర్ జనరేటర్లకు ఇంధనాన్ని ఇవ్వకపోతే దవాఖానలు 48 గంటల్లో శ్మశాన వాటికలుగా మారుతాయని గాజా వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు గాజాపై ఇజ్రాయెల్ దళాల దాడుల్లో ఆదివారం 31 మంది మరణించారు, సుమారు 100 మంది గాయపడ్డారు. దక్షిణ గాజాలో ఆహార పంపిణీ కేంద్రం సమీపంలో ఈ దాడి జరిగినట్లు సమాచారం. గాజా హ్యూమనిటేరియన్ ఫౌండేషన్ ఆదివారం రెండు ఆహార పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. మరోవైపు ఖాన్ యూనిస్‌లోని కీలకమైన దవాఖాన కింద హమాస్ సొరంగాన్ని గుర్తించినట్టు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది.

రూ.5 పార్లేజీ బిస్కెట్ గాజాలో రూ.2,400

- విచ్చలవిడిగా బ్లాక్ మార్కెట్
- దారి మళ్లిన మానవతా సాయం

న్యూఢిల్లీ, జూన్ 8: భారత్‌లో అత్యంత చవకైన ఆహార పదార్థంగా, ప్రతి ఇంట పిల్లలు, పెద్దలు అంత్యంత ఇష్టంగా తినే పార్లే జీ బిస్కెట్లు యుద్ధంతో తల్లడిల్లుతున్న గాజాలో ఖరీదైన సరుకుగా మారిపోయాయి. మన దేశంలో 5 రూపాయలకు దొరికే బిస్కెట్ ప్యాకెట్ ద్రవ్యోల్బణం పతాక స్థాయికి చేరిన గాజాలో 500 రెట్లు ఎక్కువగా రూ. 2,400కి పెరిగి అది కూడా అత్యంత కష్టంగా లభ్యమవుతున్నది. గాజా నుంచి వైరల్ అయిన ఓ తాజా సోషల్ మీడియా పోస్టులో ఓ వ్యక్తి తన కుమార్తెకు అత్యంత ఇష్టమైన పార్లేజీ బిస్కెట్ ప్యాకెట్‌ను 24 యూరోలకు పైగా(రూ. 2,342) చెల్లించి కొన్నానని తెలిపాడు. 'చాలా సేపు ఎదురు చూసిన తర్వాత మొత్తమ్మీద ఈరోజు రవీఫ్‌కి ఇష్టమైన బిస్కెట్లు దొరికాయి. మామూలుగా 1.5 యూరోలకు అమ్మే బిస్కెట్లు 24 యూరోలకు పెరిగి